ఫీవర్ సర్వేపై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర - గజపతినగరం : మండలంలోని మరుపల్లి పీహెచ్సీ పరిధిలో వైద్య సిబ్బంది ఆశా వర్కర్లకు మంగళవారం డాక్టర్ సాయి కృష్ణారెడ్డి డాక్టర్ అనూజ్ డాక్టర్ సుష్మ లు సిబ్బందికి పలు సూచనలు సలహాలు అందించారు అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త ఇంటింటికి వెళ్లి జ్వర పీడితులను గుర్తించి చికిత్స అందించాలని కోరారు ఆశా డే పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేపట్టామని అన్నారు. ఈ కాలంలో వచ్చే వ్యాధులు మలేరియా డెంగ్యూ టైఫాయిడ్ విష జ్వరాలతో పాటు వాంతులు విరోచనాలపై

అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

నిత్యవసర వస్తువుల అధిక ధరలు తగ్గించాలి : సీపీఐ ఆందోళన

విశాలాంధ్ర - బొబ్బిలి : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టపరిచి అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు చేసి, పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ దేశవ్యాప్త ఆందోళన కార్యక్రమం పిలుపులో భాగంగా పట్టణం బలిజిపేట రోడ్డు వద్ద భారత కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీజిల్లా సహాయ కార్యదర్శి అలమండ ఆనందరావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న లు మాట్లాడుతూ రోజురోజుకు నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశం అంటుతున్నాయని పెరిగిన ధరల వలన పేద, సామాన్య మధ్యతరగతి ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని. దీంతో పాటు పెట్రోల్ డీజిల్ వంట గ్యాస్ ధరలను కేంద్రంలో మోడీ ప్రభుత్వం అమాంతంగా పెంచి ప్రజాజీవనం అస్తవ్యస్తంగా మార్చిందని. అధిక ధరల తగ్గింపు హామీలు కేవలం ఎన్నికల ప్రచారానికే పరిమితమయ్యాయి అన్నారు. మోడీ పరిపాలనలో కేవలం కార్పొరేట్ శక్తులకు లబ్ధి చేకూర్చేందుకే నూతన సంస్కరణలను తీసుకువస్తున్నారని ఆరోపించారు . ఒకవైపు కొత్త రేషన్ కార్డులు మంజూరుకు జనాభా లెక్కలతో ముడిపెడుతూ మరోపక్క కార్డుదారులు మరోసారి ఆధారాలు చూసి రేషన్ కార్డులను పునరుద్ధరించుకోవాలనే నిబంధనలు పెడుతూ రేషన్ కార్డులు కుదించే యోచనలో ప్రభుత్వాలు ఉన్నాయని. దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలనే సుప్రీంకోర్టు ఆదేశాలను భే ఖాతరు చేస్తున్నారని అన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 14 రకాల నిత్యవసర వస్తువులను ఇవ్వాల్సిన ప్రభుత్వాలు కేవలం నాసిరకం బియ్యం పంపిణీతో చేతులు దులుపుకుంటున్నారని విమర్శించారు. ఆహార భద్రత చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ బొబ్బిలి మండల కార్యదర్శి తాడంగి ఎండు దొర. . సీపీఐ పట్టణ నాయకులు కొలుసు సత్యనారాయణ. వై బాబ్జి. నారాయణ ఏఐవైఎఫ్ బొబ్బిలి నియోజకవర్గం కార్యదర్శిబి తులసి. ఏఐఎస్ఎఫ్ బొబ్బిలి నియోజకవర్గ అధ్యక్షులు బి.శ్రావణ్ పాల్గొన్నారు.

మరణించిన పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్పీ వకుల్ జిందల్

విశాలాంధ్ర - విజయనగరం : విజయనగరం జిల్లా పోలీసుశాఖలో పని చేసి, ఇటీవల కాలంలో మరణించిన కానిస్టేబులు, హెూంగార్డు కుటుంబాలకు "చేయూత"ను అందించేందుకు సిబ్బంది ప్రోగు చేసిన ఒక్క రోజు అలవెన్సును వారి కుటుంబ సభ్యులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్, మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ - పోలీసుశాఖలో పని చేస్తూ ప్రమాదవసాత్తు లేదా ఆకస్మికంగా లేదా అనారోగ్యంతో మరణించిన పోలీసు కుటుంబాలు ఆకస్మికంగా తమ కుటుంబ యజమానిని కోల్పోయి, ఆర్థికంగా నష్టపోయిన సమయంలో వారికి ప్రభుత్వం నుండి బెనిఫిట్స్ అందేంత వరకు వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకొనేందుకు పోలీసుశాఖకు చెందిన ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, కొంత మొత్తాన్ని ప్రోగు చేసి, వారి కుటుంబాలకు "చేయూత"గా అందజేయడం అభినందనీయమన్నారు. ఈ తరహా చర్యలు చేపట్టడం వలన పోలీసు ఉద్యోగుల్లో ఐకమత్యం పెరగడంతోపాటు, వారి కుటుంబాలకు అండగా ఉన్నామన్న భరోసా లభిస్తుందని ఎస్పీ అన్నారు. జిల్లా పోలీసుశాఖలో హెూంగార్డుగా పని చేస్తూ, మరణించిన ఎస్. చిన్నోడు కుటుంబానికి 'చేయూత'గా హెూంగార్డులు ప్రోగు చేసిన ఒక్కరోజు అలవెన్సు రూ.3,25,890/- చెక్ ను వారి సతీమణి ఎం.రజనికి ఎస్పీ వకుల్ జిందల్ అందజేశారు.. అదే విధంగా జిల్లా పోలీసు శాఖలో కానిస్టేబులుగా పని చేస్తూ, అనారోగ్య కారణాలతో మరణించిన పి.గౌరీ కుమార్ కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన అడిషనల్ కార్పస్ ఫండ్ రూ. 1,00,000/-ల చెక్ ను వారి సతీమణి టి.ఇందిరా వసంతికి అందించారు. మరణించిన హెూంగార్డు చిన్నోడు సతీమణి రజనికి ఇప్పటికే హెూంగార్డుగా ఉద్యోగం కల్పించామని తెలిపారు. అదే విధంగా కానిస్టేబులు గౌరీ కుమార్ కుటుంబానికి ప్రభుత్వం నుండి రావల్సిన రాయితీలను సకాలంలో వచ్చే విధంగా చర్యలు చేపట్టడంతోపాటు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు ప్రతిపాదనలు పంపుతామని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ యూనివర్స్, ఆఫీసు సూపరింటెండెంట్ ఎ.ఎస్.వి. ప్రభాకరరావు, ఆర్ఐ ఆర్.రమేష్ కుమార్, పోలీసు కుటుంబ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల సమస్యలనే వెంటనే పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యంలో నిరసన

విశాలాంధ్ర - ఎస్.కోట : ఎస్ కోట మండలం కొట్టం పి హెచ్ సి వద్ద ఆశ వర్కర్లు యూనియన్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్లకి ఒక్కరికి కనీస వేతనం 26 వేల రూపాయలు అందించాలంటూ అదే విధంగా ప్రభుత్వ పథకాలను వారికి వర్తింప చేయాలంటూ పనిచేసే ప్రదేశాల్లో రక్షణ కల్పించాలంటూ నిరసన ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ఎస్ కోట మండల ఆశా వర్కర్లు భారీ ఎత్తున హాజరయ్యారు ఈ కార్యక్రమంలో పీహెచ్సీ అధికారిని హారిక కు వినతిపత్రం అందించారు

పొలంబడి కార్యక్రమం నిర్వహించిన వ్యవసాయ శాఖ అధికారి రవీంద్ర

విశాలాంధ్ర - శృంగవరపుకోట : ఎస్ కోట మండలం వాసి గ్రామంలో జీఏపి పొలంబడి నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎస్.కోట వ్యవసాయ శాఖ అధికారి కే రవీంద్ర పాల్గొనడం జరిగింది రవీంద్ర మాట్లాడుతూ వరి పంటలో మేలు అయిన యాజమాన్యం పద్ధతుల గురించి చర్చించారు వరిలో విత్తన శుద్ధి మరియు కాలిబాటల గురించి వివరించడం జరిగింది ఎరువులు మోతాదు తగ్గించు కోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి కే రవీంద్ర విఏఏ వివేక విఏఏ రవి పకృతి వ్యవసాయ సిబ్బంది డి.కృష్ణ రైతులు తదితరులు హాజరయ్యారు.

నాణ్యతాలోపం సహించేది లేదు

నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర - విజయనగరం : నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాన్ని సహించబోమని నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య స్పష్టం చేశారు. పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. వివిధ ప్రాంతాలలో నిర్మాణ దశలో ఉన్న కాలువలు, కల్వర్టులు, రహదారుల మరమ్మతు పనులు, ఇత్యాది అంశాలను పరిశీలించారు. నెహ్రూ పార్క్ లో ఏర్పాటు చేసిన బోరును పరిశీలించారు. ఆయా విభాగాల అధికారులతో కలిసి పనుల పరిస్థితిని గమనించి, తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ కే శ్రీనివాసరావు, డీఈలు అప్పారావు, ఏఈలు వెంకటేశ్వరరావు, పార్వతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చింతాలమ్మ తల్లి భూమి ఆక్రమిస్తే చర్యలు తీసుకోవాలి

గ్రామ పూజారి తమ్మినాయుడు

విశాలాంధ్ర - రామభద్రపురం : తారాపురం గ్రామ రెవెన్యూ పరిధిలో జాతీయ రహదారి పాత షుగర్ ఫ్యాక్టరీ వద్దఉన్న చింతాలమ్మ తల్లి భూమి నీ కొంత మంది వ్యక్తులు ఆక్రమించుకోవడానికి చూస్తున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామ పూజారి తమ్మి నాయుడు అన్నారు. మంగళవారము తాసిల్దార్ సులోచనరాణికి గ్రామ పెద్దలు ప్రజలు పూజారులు కలిసి భూఆక్రమణ పై వినతి పత్రం అందజేశారు. గతంలో దేవుడు మాన్య నిమిత్తం మా గ్రామానికి గ్రామ పూర్వీకులు ఆ భూమిని ధారధత్వం చేశారని అన్నారు. ఈమధ్య భూములు రేట్లు పెరగడంతో కొంతమంది వ్యక్తులు కన్ను ఆ భూమిపై పడిందని అన్నారు. దేవుడు భూమిని ఎవరైనా ఆక్రమించుకోవాలని చూస్తే గ్రామ ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ఎక్కడో ఉన్న దొంగ సర్వే నెంబర్లు కొన్ని తీసుకొని వచ్చి కోట్లు విలువ చేసే భూమిపై రాత్రికి రాత్రి వన్ బీలు సృష్టించి రెవెన్యూ వారు సంబంధం లేని వ్యక్తులకు వన్ బి చేసి వారికి ఇవ్వడం చాలా విడ్డూరంగా ఉందని అన్నారు. వందల సంవత్సరాల నుంచి ఆ భూమి గ్రామస్తుల ఆధీనంలో ఉందని అన్నారు. అక్కడే గ్రామ పండగ సందర్భంగా ఊరందరూ వచ్చి దేశం తల్లి వారాలు జరుపుకోవడం ఆనవాయితీగా ఉందని అన్నారు. ఇప్పుడు ఏదో ఒక వ్యక్తి పేరు చెప్పి 58 సెంట్లు దేవుడు మన్యం కొట్టేయడం చాలా తప్పు అని అన్నారు. ఎక్క డో ఉన్న సర్వే నెంబర్ కి వన్ బి లో ఉన్న సర్వే నెంబర్ కి చాలా తేడా ఉందని అన్నారు. రెవెన్యూ వారు గ్రామస్తులతో సమగ్ర విచారణ జరిపి గ్రామస్తులకు న్యాయం చేయాలని గ్రామ ప్రజలు కోరుచున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పూజారులు సూరయ్య గారి లక్ష్మన్న, బెవర చిన్నమ్మ తల్లి, బెవరా సింహాచలం, గ్రామ పెద్దలు ఎంపీటీసీ ప్రతినిధి బెవర చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

పాలవలసలో గడిగడ్డ కాలువ పూడికతీత పనులు

విశాలాంధ్ర - గుర్ల : మండలంలో పాలవలస గ్రామంలో గడిగెడ్డ కాలువ పూడిక పేరుకు పోవడంతో సర్పంచ్ పొట్నూరు కనకమ్మ, ఉప సర్పంచ్ వల్లూరు రాము పూడిక తీత పనులు మంగళవారం చేపట్టారు. ఈ మేరకు గ్రామానికీ గడిగెడ్డ నుండి పాలవలసకు సాగు నీరు సక్రమంగా రావడంలేదు దీంతో గ్రామ రైతులు నానా పాట్లు పడుతున్నారు. దీంతో సర్పంచ్ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లారు. చివారు అయకట్టు ప్రాంతానికి నీరు సక్రమంగా రావడంలేదు ఈ మధ్యనే గడిగడ్డ నుండి నీరు విడుదల చేశారు. అయినా నీరు గ్రామాల్లో ఉన్న చెరువులకు సక్రమంగా రావడంలేదు. కాలువలో పూడికలు పేరుకు పోవడంతో సాగునీరు చెరువులకు సక్రమంగా చేరడం లేదు దీంతో గ్రామ రైతులు కోరిక మేరకు పూడిక తీత పనులు జేసిబి సహాయం తో తొలగిస్తున్నారు. పూర్తి స్థాయిలో పూడిక తీత పనులు జరిగితే గ్రామంలో పంటలు పండడానికి ఆస్కారం ఉంటుందనీ రైతులు తెలుపుతున్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

విశాలాంధ్ర - దత్తిరాజేరు : మండలంలో గల పెదకాద గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవంలో భాగంగా మంగళవారం అంగన్వాడి సూపర్వైజర్ ధన లక్ష్మి ఆధ్వర్యంలో చిన్నపిల్లల నుండి వృద్ధుల వరకు పౌష్టికాహారం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పౌష్టికాహారం తీసుకోకపోతే వ్యాధుల బారిన పడే అవకాశం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

సహాయస్ఫూర్తికి బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డు

విశాలాంధ్ర - గజపతినగరం : గజపతినగరం శంకర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఆత్మకూరు శంకర్రావు జయంతి సందర్భంగా విశాఖపట్నంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు ఇందులో సహాయస్ఫూర్తి ఫౌండేషన్ కు బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు లభించింది ఆగస్టు 2023 నుంచి సెప్టెంబర్ 2024 వరకు గజపతినగరం ప్రాంతంలో 14 శిబిరాలు నిర్వహించి 359 మందికి సర్జరీలు చేయించినందుకు ఈ అవార్డు లభించిందని అధ్యక్ష కార్యదర్శులు సాయి కుమార్ సాయి రేవంత్ లు తెలిపారు.

ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులపై ఎమ్మెల్యే కోళ్ల అధికారులతో సమావేశం

విశాలాంధ్ర -లక్కవరపుకోట : బాబు జగ్జీవన్ రావు సుజల స్రవంతి లెఫ్ట్ కెనాల్ ప్రాజెక్టు పనులపై మంగళవారం మండల కేంద్రంలోని ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి నివాసంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్యాకేజీ రెండు ప్రాజెక్టు పనులకు ల్యాండ్ ఎక్విజేషన్ పై అధికారులు , రైతులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.మురళీకృష్ణ, హెచ్డిటివి రాజేష్, గజా కంపెనీ డీజీఎం కే సతీష్, డి ఈ బి లక్ష్మీ సుధా, ఎల్ కోట మాజీ ఎంపీపీ కొల్లి వెంకటరమణ మూర్తి, మండల పార్టీ అధ్యక్షులు చొక్కాకుల మల్లు నాయుడు, ఉపాధ్యక్షులు పాతల వెంకటరమణ, కోన సత్యం, డెక్క దేవదు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఓలు ఇంటింట వెళ్లి ఓటర్ల సర్వేలు పూర్తి చేయండి

తహసీల్దార్ అజు రఫి జాన్

విశాలాంధ్ర - మెరకముడిదాం : మండలంలో తహసీల్దార్ కార్యాలయం లో మంగళ వారం నాడు తహసీల్దార్ అధ్యక్షతన బిఎల్ఓ సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.64 బి ఎల్ ఓ గాను 64 పోలింగ్ బూతులు ఉన్నవి.కావున ఇంటింటికి వెళ్లి ఓటర్ల జాబితా లో డెత్ లు తొలగించి, నూతన ఓటర్ల నమోదు, పేరు,ఫోటో సరిపడే విధంగా చూడాలని ఓటర్ల బదిలీలు ఉంటే వాటిని సక్రమంగా నిర్వహించాలని.ఇలాంటి ఏవైనా లోపాలు ఉంటే వాటిని సవరించాలని తహాసిల్దారు బిఎల్ఓ కు సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ గిరిధర్ బిఎల్ఓలు పాల్గొన్నారు.

5 నుంచి జిల్లాలో భారీ వర్షాలు..వరద ప్రమాదాన్ని ముందే గుర్తించాలి : కలెక్టర్ ఆదేశం

విశాలాంధ్ర - విజయనగరం : ఈ నెల 5 నుంచి 7వ తేదీవరకు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని, అలాగే బంగాళాఖాతంలో మరో అల్పపీడనం కూడా ఏర్పడే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. జిల్లా యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు, తాశిల్దార్లు, ఎంపిడిఓలు, ఇరిగేషన్ ఇంజనీర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నదులు, రిజర్వాయర్లలో నీటి ప్రవాహ పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మడ్డువలస రిజర్వాయర్లో ఇన్ఫ్లో ఇప్పటికే ఎక్కువగా ఉందని, అందువల్ల ఇప్పటినుంచే అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. మడ్డువలస ప్రభావిత గ్రామాల్లోనే విఆర్ఓలు రాత్రీపగలూ ఉండి, ఇరిగేషన్ అధికారులను ప్రతీ మూడు గంటలకోసారి సంప్రదించి రిజర్వాయర్ ఇన్ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలను తెలుసుకోవాలని సూచించారు. పునరావాస కేంద్రాలను కూడా

ముందుగానే గుర్తించాలని చెప్పారు. ఛత్తీస్ఘడ్, ఒడిషా రాష్ట్రాల్లో భారీ వర్షాలు ఉన్నాయని, రానున్న రెండుమూడు రోజుల్లో నాగావళి నదిలో, తద్వారా తోటపల్లి కాలువల్లో ప్రవాహం పెరిగే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా వంగర, రేగిడి ఆమదాలవలస, సంతకవిటి మండలాల్లోని 30 గ్రామాలపై దీని ప్రభావం ఉంటుందని చెప్పారు. ఆంధ్ర, తాటిపూడి రిజర్వాయర్లలో నీటి నిల్వ పరిస్థితిపై ఆరా తీశారు. ప్రస్తుతానికి ఈ రెండు రిజర్వాయర్లలో ప్రమాద పరిస్థితులు లేనప్పటికీ, భవిష్యత్తులో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, అందువల్ల దానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా వరదలు సంభవిస్తే ఎదుర్కొనడానికి జిల్లా యంత్రాంగం సర్వ సన్నద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులూ పడకుండా ముందు జాగ్రత్త చర్యలను తీసుకోవాలన్నారు. ఆయా గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. త్రాగునీరు, పారిశుధ్యం, ప్రజారోగ్యంపై దృష్టి పెట్టాలని ఎంపిడిఓలను ఆదేశించారు. ఎంపిడిఓలంతా ఆయా మండల కేంద్రాల్లోనే ఉండాలని ఆదేశించారు. అలాగే రిజర్వాయర్ల ప్రభావిత ప్రాంతాల్లోని విఆర్ఓలంతా వారి గ్రామాల్లోనే ఉండి నిరంతరం ప్రవాహాల పరిస్తితులను తెలుసుకొని ప్రజల్ని అప్రమత్తం చేయాలని సూచించారు. ఒకవేళ వరద పరిస్థితి వస్తే, దానిని కనీసం ఒక రోజు ముందుగానే అంచనా వేసి, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్లో డిఆర్ఓ ఎస్డి అనిత పాల్గొన్నారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్ట పరచాలి : సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ

విశాలాంధ్ర - గజపతినగరం : నిత్యావసల వస్తువుల ధరలను తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్ట పరచాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేసారు. గజపతి నగరం పట్టణంలోని నీళ్ల ట్యాంక్ వద్ద సంబంధిత గోడ పత్రికలను జిల్లా సమితి సభ్యులు పురం అప్పారావుతో కలసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర ధరల పెంపుపై దేశవ్యాప్తంగా సిపిఐ చేపట్టే ఆందోళన కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ పటిష్టపరచాలని, అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. పెట్రోల్ డీజిల్ ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 6 వరకు జరిగే సిపిఐ ఆందోళన కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయ వంతం చేయాలన్నారు. నిత్యవసర వస్తువుల విపరీతంగా పెరిగి పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజలపై మోయలేని ఆర్థిక భారం పడుతోందన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను విపరీతంగా పెంచడం అన్యాయం అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిత్యవసర వస్తువుల ధరలు తగ్గించాలని, ప్రస్తుత ధరలకు అనుగుణంగా బడ్జెట్లో నిధులు కేటాయించాలని అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. కేరళ తరహాలో నిత్యవసర వస్తువులను సబ్సిడీ రేట్లకే చౌక డిపోల ద్వారా అందించాలన్నారు. ఆహార భద్రత చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు పురం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

మోపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 39వ నేత్రదాన పక్షోత్సవాలు

విశాలాంధ్ర - డెంకాడ : 39వ నేత్రదాన పక్షోత్సవాలు భాగంగా డెంకాడ మండలంలోని మోపాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేత్ర దానం యొక్క విశిష్టతను తెలుపుతూ మంగళవారం అవగాహన కార్యక్రమం, నిర్వహించారు తదనంతరం ఆసుపత్రి సిబ్బందితో మోపాడ గ్రామంలో నేత్రదాన అవగాహనపై ర్యాలీ నిర్వహించారు. మోపాడ అఫ్తాల్మిక్ ఆఫీసర్ మజ్జి గణపతి రావు అధ్యక్షతన జరిగిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారిని మరియు జిల్లా ఎయిడ్స్,క్షయ మరియు లెప్రసి నియంత్రణ అధికారిణి డా.కె.రాణి మాట్లాడుతూ నేత్రదానం ప్రతీ ఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా,కుటుంబ సాంప్రదాయంగా గుర్తించి,నేత్రదానం చేయుటకు ముందుకురావాలని మరణాంతరం ఒక్కరు చేసే నేత్రదానం ఇద్దరి అంధులకు చూపు నిస్తుందని నేత్రదానంపై ప్రజలలో అపోహలను తొలగించి,అవగాహన కలిగించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ప్రతీ సంవత్సరం ఆగస్టు25 నుండి సెప్టెంబర్ 8వ తేదీ వరకు ప్రభుత్వం నేత్రదాన ప్రచార పక్షోత్సవాలను విర్వహిస్తుందని తెలిపారు. మోపాడ వైద్యాధికారిణి డా.పి.వి.యోగితాబాల మాట్లాడుతూ మరణించిన వ్యక్తి నుండి 6 గంటలలోపు నేత్రాలను సేకరించాలని, నేత్ర దానం చేయుటకు స్త్రీ పురుష వయోభేదం లేకుండా ప్రతీ ఒక్కరూ చేయవచ్చునని, మరణాంతరం కూడా తమకళ్ళతో చూపు లేనివారికి దృష్టిని ప్రసాదించవచ్చునని తెలిపారు. ఆరోగ్య విస్తరణాధికారి సిహెచ్.సత్యనారాయణ పర్యవేక్షణలో ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు ఎస్.సూరిబాబు, వైద్యసిబ్బంది గున్నమ్మ, రహమతుణ్ణీసా, రమణమ్మ, మహేశ్వరి, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గింజలు ద్రావణంతో చీడపీడలు మరియు తెగుళ్లు నివారణ

విశాలాంధ్ర - మెరకముడిదాం : మండలంలో గరుగుబిల్లి యూనిట్ ఇన్చార్జ్ బూరాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గరుగుబిల్లి యూనిట్లో ఉన్న గరుగుబిల్లి గ్రామంలో ఉన్న శ్రీ సాయి సరస్వతి గ్రామ సంఘంలో సేద్యము చేస్తున్న రైతులకు చిన్న పూతికవలస, పెద్ద పూతికవలస గ్రామాల్లో రైతులు ఉన్న గరుగుబిల్లి గ్రామ సంఘం లో రైతులకు, యాడిక గ్రామంలో ఉన్న శ్రీ గౌరీ శంకర్ గ్రామ సంఘంలో ఉన్న రైతులకు మరియు యాడిక గ్రామ సంఘములో ఉన్న రైతులకు సంబంధించిన వరి పంటకు సాధారణంగా ప్రస్తుత వాతావరణం అనగా తుఫాన్ తరువాత సాధారణంగా వరి పంటకు వచ్చే సుడిదోమ, అగ్గి తెగులు, కుళ్ళు తెగులు నివారణకు, కూరగాయలు మరియు ఆకుకూరలకు వచ్చే దోమలు, పురుగులు మరియు తెగుళ్లు నివారణకు గాను వేప, కానుగ, ఆముదం మరియు కరక్కాయలు తో తయారు చేసిన ద్రావణమును ఒక లీటరు వంద లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయడం వలన పైన ఉదహరించిన అన్ని రకాలకు నివారణకు సమర్థవంతంగా పనిచేయును. ఈ గింజల ద్రావణం తయారీ గూర్చి స్థానిక యూనిట్ ఇంచార్జ్ బూరాడశ్రీనివాసరావు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చీపురుపల్లి డివిజన్ మాస్టర్ ట్రైనర్ కె. సూర్యకుమారి, స్థానిక సర్పంచ్, ఐసిఆర్పిలు పాచిపెంట శివకుమార్, పి.దీపిక, రైతుశాస్త్రవేత్త వై. శంకర్రావు పాల్గొన్నారు.

అక్రమ లేఔట్లపై చర్యలు చేపట్టాలి : మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర - బొబ్బిలి : పట్టణం లో అనుమతులు లేని అక్రమ లేఔట్ పై చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారి వరప్రసాద్ ను మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి ఆదేశించారు.మంగళవారం మున్సిపల్ కమిషనర్ ఎల్. రామలక్ష్మి క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్లు ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ పబ్లిక్ హెల్త్ మేస్త్రీలు మరియు పర్యావరణ ఇంజనీర్ వారితో కోరాడ వీధి, శ్రీరామ్ నగర్ కాలనీ, పాకీ వీధి, తారకరామ కాలనీ మరియు స్వామి వారి వీధి ఏరియాలలో పర్యటించారు. శ్రీరామ్ నగర్ కాలనీలో జరుగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు, రోడ్లపై పశువులు కదుతున్న వారిని గుర్తించి నోటీసులు జారీ చేసి జరిమానాలు విధించవలసిందిగా ఆదేశించారు. తదుపరి తారక రామా కాలనీ వద్ద ఉన్న లేఔట్ ను పరిశీలించి అనుమతులు ఉన్నదీ లేనిది పరిశీలించి తెలియజేయవలసిందిగా టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ వారికి ఆదేశించారు, మల్లమ్మ చెరువు చుట్టుపక్కల గ్రీనరీని అభివృద్ధి చేయడానికి ప్రణాళిక చేయవలసిందిగా పర్యావరణ ఇంజనీరు వారికి ఆదేశించారు.

ఆశాలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర - మెంటాడ : మెంటాడ పిహెచ్ సిలో ఆశా డే సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి లక్ష్మీ అధ్వర్యంలో ఆశ వర్కర్లు ధర్నా చేపట్టారు. ఇటీవల కలకత్తాలో డాక్టర్ గారి పైన జరిగిన అత్యాచార సంఘటనకు నిరసనగా ధర్నా చేసి మెడికల్ ఆఫీసర్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. డాక్టర్ గారి కుటుంబాన్ని ఆదుకోవాలని, నిందితులకు కఠినంగా శిక్షించాలని, మహిళా చట్టాలను పగడ్బందీగా అమలు చేయాలని, డాక్టర్స్ కు సంబంధించి ప్రత్యేకమైన రక్షణ చట్టం చేయాలని డిమాండ్ చేసారు. అలాగే రెండో వినతిపత్రం ఎన్నికల ముందు ఆశ వర్కర్లకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ ఇవ్వాలని, పని ఒత్తిడి తగ్గించాలని డిమాండ్ చేస్తూ 36 గంటలు ధర్నా చేయడం జరిగింది. అదేవిధంగా చలో విజయవాడ కార్యక్రమం జరిగిన సందర్భంగా గత ప్రభుత్వం పై సమస్యలు పరిష్కారం చేస్తామని మినిట్స్ కాపీ రాసి ఇవ్వడం జరిగింది. ఈ ప్రభుత్వం మినిట్స్ కాఫీలో ఉన్న డిమాండ్ లను వెంటనే పరిష్కారం చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని, పని భారం తగ్గించాలని డిమాండ్ చేస్తూ రెండో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిహెచ్సి ఆశా లీడర్లు రెడ్డి సత్యవతి, సుజాత, ఆదిలక్ష్మి, రవణమ్మ ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఆర్మీ అటాచ్మెంట్ క్యాంపులో సీతం కళాశాల ఎన్సీసీ క్యాడట్స్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : స్థానిక గాజులరేగ పరిధిలో గల సీతం కళాశాలలో తృతీయ సంవత్సరం చదువుతున్న ముగ్గురు ఎన్సిసి కేడేట్స్ ఆగస్టు 19 నుండి 28 వరకు జరిగిన ఆర్మీ అటాచ్మెంట్ క్యాంప్ లో పాల్గొన్నారు. ఈ క్యాంప్ 68 ఆట్లరీ రెజిమెంట్, భువనపల్లి, సికింద్రబాద్లో ఎన్సిసి డైరెక్టరేట్ ఆంధ్ర తెలంగాణ ఆధ్వర్యంలో జరిగింది. వివిధ విభాగాలకు చెందిన ఎం.అచ్చుతరావు, సిహెచ్ వేణుగోపాల్, డి.నూతన్ కుమార్ క్యాంప్లో పాల్గొన్నారు. విద్యార్థులకు ఆర్మీ ఆయు ధాలను, ట్యాంకర్లు మొదలయిన వాటిని చూపించి వాటి ఉపయోగాలను తెలియజేసారు. ఈ క్యాంపులో హాజరైన క్యాడట్స్ కు,సీ సర్టిఫికేట్ పరీక్షలో మార్కులు కలుస్తాయి. విద్యార్థులు క్యాంప్ పూర్తి చేసుకొని వచ్చిన సందర్బంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.డి.వి.రామమూర్తి, వివిధ విభాగాదిపతులు, లెఫ్టినెంట్ ఎం.వరలక్ష్మి, లెఫ్టినెంట్ ప్రశాంత్, సి.ఎస్.ఓ కె.సత్యనారాయణ, అధ్యాపకులు, ఇతర సిబ్బంది, ఎన్.ఎస్.సి కాడెట్స్ మారియు విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

వినాయక ఆలయ వార్షికోత్సవం.. ప్రసాదం వితరణ

విశాలాంధ్ర - జామి : మండలంలోని జాగరం గ్రామంలో కోనేటి గట్టున ఏర్పాటు చేసిన శ్రీవినాయక స్వామి ఆలయం ప్రధమవార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా తెలుగుదేశం పార్టీ నేతలు కొటాన వెంకటలక్ష్మి, ఆమెభర్త కొటానదేముడు దంపతులు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్ధించారు.

జనసేన పార్టీ ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంప్

విశాలాంధ్ర - చీపురుపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా మండలంలోని వీకే పాల వలస గ్రామంలో జనసేన నాయకులు మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జనసేన పార్టీ నాయకులు బైరెడ్డి మధు జి భాస్కరరావు జనసైనికులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా మెడికల్ క్యాంపు, రక్తదాన శిబిరం లకు ప్రజల నుండి అనూహ్య స్పందన లభించింది. చీపురుపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ విసినిగిరి శ్రీనివాసరావు బ్లడ్ డొనేట్ చేయడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ లిరక్తదానం చేయండి ప్రాణదాతలు కండిలి అని మెగా ఫ్యామిలీ సూచించిన స్ఫూర్తిని కొనియాడారు. చీపురుపల్లి నియోజకవర్గంలో జనసేన పార్టీ నాయకులు జన సైనికులు వీర మహిళలు ప్రతి గ్రామ గ్రామాన ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం వారి యొక్క సేవా దృక్పథానికి నిదర్శనమని ఆయన అన్నారు. ప్రతి జన సైనికుడికి ఆయన అభినందనలు తెలియజేశారు.

కలిసికట్టుగా మలేరియాని నివారిద్దాం

విశాలాంధ్ర - ఎస్.కోట : ఎస్.కోట మండలం కొట్టం ప్రాథమిక వైద్య కేంద్రం యందు జోన్ ఆఫీసర్ మలేరియా నివారణ పై ఆశా వర్కర్లతో భేటీ అయ్యారు ఈ కార్యక్రమంలో శాంతి ప్రభ మాట్లాడుతూ ఆశ వర్కర్లు అందరూ గ్రామాల్లో దోమలు నివారణ పై తగిన సూచనలు ఎప్పటికప్పుడు ఇస్తూ ఉండాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో పాత్రికాయలు తో ఏర్పాటైన సమావేశంలో పాత్రికాయలు కొంతమంది జోన్ ఆఫీసర్ని ఎస్.కోట మండలంలో గిరి శిఖర గ్రామాలలో ఉన్నటువంటి గిరిజనులకు సరైన వైద్య సదుపాయాలు అందడం లేదని మరియు హెల్త్ క్యాంపులు గాని వైద్య సదుపాయాలు గాని గిరి పుత్రులు నోచుకోవడం లేదని తెలియజేశారు అదేవిధంగా బొడ్డవర మినీ హెల్త్ సెంటర్ లో సిబ్బంది అందుబాటులో ఉండడం లేదని తెలియజేశారు పాత్రికేయుల నుండి వచ్చినటువంటి ప్రశ్నలకు త్వరలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని జోన్ అధికారి తెలియజేశారు

ఎయిర్‌పోర్టు పైప్‌లైన్ ఏర్పాటుకు భూసేకరణ

విశాలాంధ్ర - విజయనగరం : భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి నీటిని అందించేందుకు గాను వాటర్ పైప్‌లైన్ ఏర్పాటు చేయడానికి భూ సేకరణ కోసం సంబంధిత రైతులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చర్చించారు. దీనికోసం భోగాపురం మండలం కోట భోగాపురం, నందిగాం గ్రామ రైతులతో తమ ఛాంబర్‌లో మంగళవారం సాయంత్రం కలెక్టర్ చర్చలు జరిపారు. ఈ పైప్‌లైన్ నిర్మాణానికి సుమారు 13 మంది రైతులనుంచి 33 సెంట్ల భూమిని సేకరించేందుకు అధికారులు నిర్ణయించారు. రైతుల అభిప్రాయాలను కలెక్టర్ తెలుసుకున్నారు. విస్తృత ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఈ భూమిని సేకరించడం జరుగుతోందని, ఇప్ప టికే పారమ్ సి నోటీసు జారీ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. సెంటుకు రూ.20 వేలను రైతులకు పరిహారంగా ఇవ్వాలని కలెక్టర్ నిర్ణయించారు. ఈ చర్చల్లో ఆర్‌డిఓ ఎంవి సూర్యకళ, తాశిల్దార్ సురేష్ పాల్గొన్నారు.

ఘనంగా డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పుట్టిన రోజు వేడుకలు

విశాలాంధ్ర - వేపాడ : మండలం లోని వావిల పాడు గ్రామంలో జనసేన పార్టీ వేపాడ మండలం ప్రధాన కార్యదర్శి పెంటపల్లి బుజ్జి, జనసైనుకులు, గ్రామ టీడీపీ నాయకులు గుంటపల్లి దేముడు నాయుడు, గండి గోవిందనాయుడు, వేచలపు ముత్యాల నాయుడు, బొడ్డు టిక్క నాయుడు బండారు కృష్ణ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా కేకు కట్ చేసి పవన్ కళ్యాణ్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ మిఠాయిలు పంచి పెట్టారు. అనంతరం గుంటపల్లి దేముడు నాయుడు, వారాది ఈశ్వరరావు,కణితి తాతాజీల ఆర్థిక సహాయంతో ఏర్పాటుచేసిన కుండల పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, స్థానాలలో లావేటి మంగ, జిలం సురేష్,ఎల్లంకి దేముల్లు ఏసుధాష్ గెలుసుకోగా వారికి గ్రామానికి చెందిన పెద్దలు గుంటపల్లి దేముడు నాయుడు, గండి గోవింద నాయుడు తదితరుల చేతుల మీదుగా నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు గ్రామ ప్రజలు పాల్గొని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇలాంటి పుట్టిన రోజులు మరెన్నో జరుపుకోవాలని శు భాకంక్షలు తెలియజేశారు.

మెనూ అమలుపై దృష్టి పెట్టాలి : జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్

విశాలాంధ్ర - విజయనగరం : పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం రుచిగాను, పోషక విలువలతో కూడినదిగానూ ఉండాలని అందుకోసం మెనూ ఎలా ఉంటె బాగుంటుందో చర్చించి ప్రతి పాదనలు పంపిస్తే ప్రభుత్వానికి పంపడం జరుగు తుందని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం పై ఎం.ఈ.ఓ లకు, పాఠశాల నిర్వహణా కమిటీలకు, హెచ్.ఎంలకు, భోజన నిర్వాహ కులకు కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళ వారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల వారీగా మెనూ తయారు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని , మన జిల్లా కు సరిపోయే మెనూ ను రూపొం దించడానికే ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. పిల్లలు కడుపు నిండితే ఆరోగ్యంగా ఉంటారని, ఆరోగ్యంగా ఉంటె చదువు పై దృష్టి పెడతారని, అందరి అభిప్రాయం తో కొత్త మెనూను తయారు చేయాలనీ, పిల్లలు ఇష్టంగా తినేవి, ఆరోగ్యాన్ని పెంపుదల చేసేవి మెనూ లో ఉండాలని తెలిపారు. మధ్యాహ్న భోజనం లో 16 రకాల వంటకాలను అందజేయడం జరుగుతోందని, వారంలో 5 రోజుల పాటు గుడ్డు పెడుతున్నామని , 3 రోజులు వేరుసెనగ చిక్కీలను, 3 రోజులు రాగి జావ ను ఇస్తున్నామని వీటిని కొనసాగిస్తూనే ఇంకా పోషకాలతో కూడిన ఆహారాన్ని మెనూ లో చేర్చాలని తెలిపారు. 5 రోజులు గుడ్డు ఇస్తున్నప్పటికీ ఒక్క రోజే కూర రూపం లో , మిగిలిన 4 రోజులు ఉడకబెట్టిన గుడ్డు ను ఇస్తున్నామని, అలా కాకుండా 3 రోజులు కూర రూపం లో ఇస్తే పిల్లలు ఇష్టంగా తింటారని పలువురు వంట నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వసతి గృహాలకు ఇచ్చే బియ్యం మంచి వెరైటీ సరఫరా చెయ్యాలని ఇప్పటికే పౌర సరఫరాల శాఖ వారికీ ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రాథమిక విద్యార్థులకు ప్రస్తుతం ఇస్తున్న 100 గ్రాముల బియ్యం సరిపడడం లేదని , 150 గ్రాములు ఇస్తే కడుపు నిండా తింటారని నిర్వాహకులు తెలిపారు. కుకింగ్ చార్జీలు పెంచాలని నిర్వాహకులు కోరారు. పెంపుదల విషయం ప్రభుత్వ పరిశీలన లో ఉందని కలెక్టర్ తెలిపారు. పప్పు, నూనె ప్రభుత్వమే సరఫరా చేస్తే బాగుంటుందని హెచ్.ఎం. లు కలెక్టర్ దృష్టికి తీసుకు రాగా ప్రతిపాదనలు పంపిస్తామని తెలిపారు.వంట గదులు, వంట పాత్రలు పరిశుభ్రంగా ఉంచాలని, కట్టెల పొయ్యి మీద వంట చేయవద్దని కలెక్టర్ సూచించారు. ఎన్ని సిలెండర్లు కావాలన్నా ఇవ్వడం జరుగుతుందని, ఎక్కడైనా గ్యాస్ కనెక్షన్ లేకపోతే వెంటనే తీసుకోవాలని హెచ్.ఎం. లకు తెలిపారు. స్కూల్ మానేజ్మెంట్ కమిటీలు మధ్యాహ్న భోజన పథకాన్ని నిత్యం తనిఖీ చేయాలని, అప్పుడే వంట వారు బాగా వంట చేస్తారని, వడ్డించే వారు బాగా వడ్డిస్తారని, ఈ పథకం ఉద్దేశ్యం నెరవేరుతుందని తెలిపారు. ఈ సమావేశం లోజిల్ల విద్యా శాఖాధికారి ఎన్. ప్రేమ్ కుమార్, ఎ.డి లు, డిప్యూటీ డి.ఈ.ఓ లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిదశలోనే నైతిక విలువలు పెంపొందించుకోవాలి

విశాలాంధ్ర - చీపురుపల్లి : విద్యార్థి దశలోనే విద్యార్థులు నైతిక విలువలను పెంపొ ఒదించుకొని మంచి విజ్ఞానాన్ని ఆర్జించాలని విశాఖపట్నం సర్వేజనా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ఏ సన్యాసిరావు అన్నారు. మంగళవారం స్థానిక సత్యారామ డిగ్రీ కాలేజ్, మండల ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆవరణలో ఆశయ యూత్ అసోషియేషన్, సర్వేజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థుల కు వ్యక్తిత్వ వికాసం పెంపొందించే విధంగా శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం సర్వేజన ఫౌండేషన్ వ్యవస్థా పకుడు అధ్యక్షుడు కింతలి సన్యాసిరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిత్వం వికాసం, నైతిక విలువలు గురించి క్షుణ్ణంగా వివరించారు. ప్రతి విద్యార్థి ఒక ఉన్నతమైన ఆశయాన్ని ఏర్పరుచుకుని ఎంటువంటి అటం కాలు ఎదురైన వాటిని అధికమించి లక్ష్యాన్ని సాధించినట్లు అయితే వారు తమ జీవితాలను ఉన్నత స్థితిలోకి ఉంచి తమ కుటుంబాన్ని సమాజాన్ని మంచి మార్గంలో ప్రభావితం చేయగలరు అని ఆయన అన్నారు. విలువలు వినయం లేకపోతే ఎంత చదువు కున్న వారి వల్ల సమాజానికి అత్యంత ప్రమాదం అని ఆయన అన్నారు. ప్రతి తల్లి తండ్రి గురువు పిల్లలకు బాల్యంలో మంచి విద్య తో పాటుగా మహాత్ములు జీవిత చరిత్ర లను నైతిక విలువలను బోధించి గొప్ప వ్యక్తులు గా తీర్చితిద్దగలిగితే సమాజం శాంతి యుతంగా వుంటుంది అన్ని అన్నారు. అనంతరం 2వ తరగతి చదువుతున్న విద్యార్థులు పద్యం చదువు సైకిల్ తొక్కు అనే నినాదంతో పాఠశాల కు ఉచితంగా సైకిల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యారామ డిగ్రీ కాలేజ్ ఎన్ఎస్ఎస్ పిఓ ముకుంద రావు, ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ సెక్రటరీ యం.లక్ష్మణరావు, తాడ్డి సీతా లక్ష్మీ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మాసాంతం కల్లా పందుల సంచారం అరికడతాం

ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి

విశాలాంధ్ర - విజయనగరం : నగరంలో పందుల సంచారాన్ని ఈ మాసాంతం కల్లా నిరోధించేందుకు కృషి చేస్తామని నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి వెల్లడించారు.కమీషనర్ వి.నల్లనయ్య ఆదేశాల మేరకు మంగళవారం పాలాస్పత్రిలో మస్తర్ పాయింట్ వద్ద పందుల పెంపకం దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పందుల పెంపకందారులతో ఆయన మాట్లాడుతూ నగరంలో పందుల సంచారం విచ్చలవిడిగా ఉందని, దీన్ని అరికట్టాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. పందుల సంచారం వల్ల ప్రజారోగ్యానికి తీవ్ర విఘాతం కలుగుతుందని స్పష్టం చేశారు. కావున తక్షణమే పందుల పెంపకం దారులు పందులను నగరపాలక సంస్థ పరిధి నుండి ఇతర ప్రాంతాలకు తరలించుకోవాలని ఆదేశించారు. అలా చేయని యెడల సదరు పెంపకం దారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో పారిశుధ్య పర్యవేక్షకులు బాలకృష్ణ, రామారావు, రామకృష్ణ, సలీం రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నమోదు చేసుకున్న వాహనాలకే ఇసుక రవాణాకు అవకాశం

ఉప రవాణా కమిషనర్ మణికుమార్

విశాలాంధ్ర - విజయనగరం : జిల్లాలో వినియోగదారులకు ఉచిత ఇసుకను రవాణా చేయదలచిన వాహన యజమానులంతా తమ వాహనాలను రవాణా శాఖ వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవలని ఉంటుందని ఉప రవాణా కమిషనర్ మణికుమార్ చెప్పారు. ఆవిధంగా నమోదు చేసుకున్న వాహనాలకే ఇసుక రవాణాకు అవకాశం వుంటుందన్నారు. జిల్లాలోని ఇసుక రవాణాచేసే వాహన యజ మానులతో మంగళవారం రవాణా శాఖ కార్యాలయంలో ఉపరవాణా కమిషనర్, గనులశాఖ జిల్లా అధికారి సిహెచ్.సూర్యచంద్రరావు సమావేశం నిర్వహించారు. ఉచిత ఇసుక రవాణాకు సంబంధించి ప్రభుత్వం జారీచేసిన మార్గదర్శకాలపై వారికి వివరించారు. ఇసుక రవాణాకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన ధరలను కూడా వారికి తెలియజేసి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఇసుక రవాణాకు సంబంధించి ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను రవాణాదారులంతా పాటించి వినియోగదారులకు ఉచిత ఇసుకను సులభతరంగా అందించడంలో సహకరించాలని గనులశాఖ అధికారి సూర్యచంద్రరావు కోరారు.

అమ్మవారి దేవాలయంలో లోక కళ్యాణార్ధం శాంతి హోమం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయాలు వనంగుడి, చదురు దేవాలయాల వద్ద పోలాల అమా వాస్య, మంగళవారం కావడంతో భక్తులు పోటెత్తారు. వనంగుడిలో దేవస్థానం ఇఓ డివివి ప్రసాదరావు పర్యవేక్షణలో లోక కళ్యాణార్థం శాంతి హెూమం, పూర్ణాహుతి నిర్వహించారు. వేద పండితులు సాయికిరణ్ శర్మ, తాతా రాజేష్ శర్మ లువేదపారాయలు చేసారు, చదురుగుడి లలో పైడితల్లి అమ్మవారికి. తెల్లవారుజామున పంచామృత అభిషేకాలు ఆలయ అర్చకులు ఏడిద వెంకటరమణ, పూజారి బంటుపల్లి వెంకట్రావు ,ధనుంజయ్ ఆధ్వర్యంలో నిర్వహించిప్రత్యేక అలంకరణ లు చేసారు. సుదూర ప్రాంతాల నుండి విచ్చేసిన భక్తులు అమ్మవారికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు అనంతరం దేవాలయ ప్రాంగణంలో ప్రసాద వితరణ, మధ్యాహ్నం భోజన ఏర్పాట్లును భక్తులకు దేవస్థానం అధికారులు చేపట్టారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సీనియర్ అసిస్టెంట్లు ఏడుకొండలు మణికంఠ చర్యలు చేపట్టారు. మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

నెమలం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - తెర్లాం : మండలం లో మంగళవారం పెరుమాలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ మనోజ్ఞ మరియు డాక్టర్ శ్రీనివాసరావు (ఆయుస్) ఆధ్వర్యంలో నెమలం గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించడ మైనది. గ్రామంలో ఉన్న జ్వర పీడితులను గుర్తించి రక్త పరీక్షలు నిర్వహించి చికిత్స అందించడమైనది. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మరియు సిబ్బంది పాల్గొనడమైనది.

గురజాడ గ్రంధాలయంలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలి

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ ఆధ్వ ర్యంలో గురజాడ గ్రంధాలయంలో మౌలిక సదు పాయాలు మెరుగుపరచాలని, గ్రంధాలయం ముందు నిరసన తెలియజేస్తూ అనంతరం గ్రంథాలయ ప్రతినిధులు బి.లక్ష్మీకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది.. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సిహెచ్ హరీష్ మాట్లాడుతూ జిల్లా ప్రధాన గ్రంథాలయానికి సుమారు 400 మంది విద్యార్థులు చదువుకోవడానికి వస్తున్నారని, వాళ్లకు సరిపడా వసతులు లేవన్నారు. ఎక్కడ చూసినా చెత్త పేరుకు పోవడం వల్ల, దోమలు చేరి విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. ప్రస్తుతం కాంపి టేటివ్ సంబంధించి బుక్స్ అందుబాటులో తీసుకొని రావాలన్నారు. పాత గ్రంధాలయ భవనం కావడం వలన పెచ్చులు పడిపోతున్నాయని. వెంటనే మర మ్మతులు చేయాలని లేని పక్షాన ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పి. తవిటి నాయుడు, శ్రీను, కిరణ్ కుమార్, తరుణ్, తోపాటు నిరుద్యోగులు పాల్గొన్నారు.

గర్భిణీ స్త్రీలు మంచి ఆహారాన్ని తీసుకోవాలి

సూపర్ వైజర్ అనురాధ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : పోషకాహార మాసొత్సవాలు సందర్భంగా విజయనగరం ఐసిడిఎస్ 5వ సెక్టార్ పరిధిలో ఉన్న అయ్యన్నపేట యస్‌సికొలనీ. మినీ అంగన్వాడి కేంద్రంలో మంగళ వారం పౌష్టికాహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ అనురాధ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు మంచి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటే పుట్టబోయే పిల్లలు ఆరోగ్యకరంగా పుడతారని అన్నారు ఈ సంవత్సరం పోషణ మహా మాసోత్సవాల్లో భాగంగా పౌష్టికా హారముపై అందరికీ అవగాహన కల్పించడం జరుగు తుంది అని తెలిపారు అంగన్వాడి కేంద్రాల్లో ఇచ్చిన పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించుకోవాలన్నారు ఆరు నెలలు దాటిన పిల్లలకు అదనపు ఆహారాన్ని అందిస్తే పిల్లలు ఎదుగుదల బాగుండి చురుకుగా ఉంటారని తెలిపారు సెప్టెంబర్ మాసం అంతా పోషణ మాసోత్సవాలు జరుగుతాయి అన్నారు. ఆరు నెలల నిండిన వెంటనే ప్రతి బిడ్డకు అదనపు పౌష్టికాహారాన్ని ద్రవరూపంలోనూ గుజ్జురూపంలోని పిల్లలకు తప్ప నిసరిగా పెట్టవలెనని తల్లులకు వివరించారు ప్రభుత్వం అంగన్వాడి కేంద్రంల ద్వారా ఇస్తున్న పౌష్టికా హారాన్ని తప్పనిసరిగా అందరూ వినియోగించుకోవాలని అదేవిధంగా తప్పనిసరిగా అంగన్వాడి కేంద్రానికి పిల్ల లను పంపించాలన్నారు కిషోర్ బాలికలుగా ఉన్నప్పుడే ములగాకు బొప్పాయి కరివేపాకు నువ్వులు శనగ పలుకు ఉండలు రోజుకొకటి చప్పున తింటూ ఉంటే రక్తం బాగా వృద్ధి చెందుతుందని తద్వారా మంచి ఆరోగ్యంగా చురుగ్గా కూడా ఉంటారన్నారు. ఈ కార్య క్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు తల్లులు పాల్గొన్నారు.

5న రక్తదాన శిబిరం

విశాలాంధ్ర - గజపతినగరం : గజపతి నగరం సాయి సిద్ధార్థ కళాశాలలో గురువారం గురుపూజోత్సవం పురస్కరించుకొని ఉదయం 9:45 నిమిషాల నుండి రక్తదాన శిబిరం నిర్వహించు తున్నామని కళాశాల యాజమాన్యం శేఖర్ తెలిపారు ఈ శిబిరంలో దయార్థ హృదయ లు తమ సేవా దృక్పథంతో నిలబెట్టే వ్యక్తులుగా నిలిచి అందరికీ ఆదర్శంగా ఉండాలని కోరారు.

ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనానికి జిల్లా నేతలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : గత రెండు రోజులుగా ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనలో భాగంగా మంగళవారం విశాఖపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నుండి దేవి పార్క్ వరకు జరిగే ర్యాలీ, భారీ బహిరంగ సభకు జిల్లా నుండి ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎస్.రంగరాజు ఆధ్వర్యంలో పట్టణంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నుండి ఎత్తు బ్రిడ్జి జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం విశాఖపట్నం బయలుదేరారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎస్ రంగరాజు మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్మికులకు తీవ్రంగా అన్యాయం చేసిందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలను అదుపు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కార్మిక చట్టాలకు తూట్లు పొడిచిన ఘనత బిజెపికి దక్కిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమకాలు బిజెపి, ఆర్ఎస్ఎస్ కు సంబంధించిన వ్యక్తులకు రిజర్వేషన్లకు భిన్నంగా నియమిస్తుందన్నారు. దీనిని ఏఐటీయూసీ వ్యతిరే కిస్తుందన్నారు. ప్రస్తుతం జరుగుతున్న సమావేశంలో రానున్న కాలంలో జరిగే విధి విధానాలను తెలియ జేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జె కామేష్, తుపాకుల శ్రీను, దలై శ్రీను, కళ్యాణ శ్రీను, క్లాప్ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాస్, మ్యాక్సీ క్యాబ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం అప్పలనారాయణ ,విజయ్ ,చిన్న, తదితర కార్మికులు పాల్గొన్నారు

బాల్య వివాహాలను నిషేధించండి : ఇంచార్జ్ పిఓ జై పైడి మంగమ్మ

విశాలాంధ్ర - చీపురుపల్లి : బాల్య వివాహాల నిషేధిత చట్టాన్ని సక్రమంగా అమలు జరిగే ప్రతి ఒక్క కార్యకర్త బాధ్యత తీసుకోవాలని చీపురుపల్లి ఐసిడిఎస్ ఇంచార్జ్ పిఓ జైపైడి మంగమ్మ అన్నారు. సోమవారం నాడు చీపురుపల్లి ఐసిడిఎస్ కార్యాల యంలో మండలం లోని 89 అంగన్వాడి కార్యకర్తలతో పాటు మహిళా సంరక్షణ కార్యదర్శులతో బాల్యవివాహాలు నిషేధిత చట్టం అవగాహన పైన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వలన జరిగే అనర్థాలు గురించి వివరించారు. గ్రామాల వారీగా కమిటీలను ఏర్పాటు చేసి బాల్యవివాహాలు చేస్తే దానికి సంబంధించిన చట్టాల గురించి వివరిం చాలన్నారు ఆడపిల్లలకు పూర్తిగా 18 సంవత్సరాలు నిండిన తర్వాత మగ పిల్లలకు 21 సంవత్సరంలో నిండిన తరువాత మాత్రమే పెళ్లిళ్ల చేయాలన్నారు అలా కాకుండా చట్టాన్ని ఏ ఒక్కరు అధిక మించిన పెళ్లి కుమారుడుతోపాటు పెళ్లి కుమార్తె బంధువులు కూడా చట్టపరిధిలో శిక్షకు గురవు తారు అన్నారు. బాల్యవివాహాల నిషేధిత చట్టాన్ని అతిక్రమిస్తే లక్ష రూపాయల వరకు జరిమానా జైలు శిక్ష తప్పదు అన్నారు. ఫోక్స్ సవరణ చట్టం 20019 అనుసరించి బాల్య వివాహాలు చేసుకుని సంసారం చేస్తే అత్యాచార కేసుగా పరిగణనలో తీసుకొని 20 సంవత్సరాల కంటే తక్కువ కాకుండా జైలు శిక్ష జరిమాన పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కేంద్రం నుండి వెంకటలక్ష్మి ఎన్జీవో వైసీపీ నుండి వెంకటనారాయణమ్మ సూపర్వైజర్ టి.కృష్ణవేణి అంగన్వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్య కళాశాలలో మట్టి, పంచగవ్య గణపతి విగ్రహాల పంపిణీ

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో తేది ఎన్‌సిసి, ఎన్ ఎస్ ఎస్ విభాగాల ఆధ్వర్యం లో వినాయక చవితి సందర్భంగా పర్యా వరణ హిత మట్టి, పంచగవ్య గణపతి విగ్రహాల ను పంపిణీ చేశారు. ఈ కార్య క్రమంలో ప్రజలకు పర్యావరణ పరిరక్షణ మన భాధ్యత అందుకే మట్టి గణపతి విగ్రహాల ను పూజించాలని అవగాహన కల్పించడానికి విద్యా ర్థులు మట్టి గణపతి విగ్రహాల ను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణ రావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం అందరూ మట్టి గణపతి విగ్రహాలను వినాయక చవితి రోజు పూజించాలని అందరికి వినాయక చవితి శుభాకాంక్షలు తెలి పారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవి.సాయి దేవమణి మాట్లాడుతూ అందరూ పర్యావరణాన్ని, జల చరాలను కాపాడటం తమ సామాజిక బాధ్యత గా భావించి మట్టి గణపతి విగ్రహాలను పూ జిద్దాం అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ కెప్టెన్ ఎం.సత్యవేణి, ఎన్‌సిసి ఆఫీసర్ బి. సూరవు నాయుడు, అధ్యాపకులు మరియు ఎన్‌సిసి కేడేట్స్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ రాతపూర్వక హామీలకు జీవోలు ఇవ్వాలి

విశాలాంధ్ర - విజయనగరం రూరల్ : గత ప్రభుత్వ రాతపూర్వకంగా ఇచ్చిన హామీలన్నీ, జీవోలు ఇవ్వాలని, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలి, పని భారం తగ్గించాలి, పని ప్రదేశంలో లైంగిక వేధింపులు నిరోధక కమిటీలు వేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో రాకోడు పీహెచ్సీ వద్ద నల్ల రిబ్బన్లతో నిరసన తెలియజేశారు. అలాగే పట్టణంలో లంకా పట్నం, సంతపేట, ఫుల్ బాగ్, రాజీవ్ నగర్ కాలనీ, వీటి అగ్రహారం, కేఎల్ పురం, పద్మావతి నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్ద ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు మహాలక్ష్మి, పద్మ, వాసవి, కనకమహాలక్ష్మి, అప్పయ్యమ్మ, ఆదిలక్ష్మి ల నాయకత్వంలో ఆశాలు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు అనంతరం వైద్యాధికారులకు, హెచ్‌విలకు వినతి పత్రం ఇచ్చారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆర్జీ కార్ మెడికల్ కళాశాల విద్యార్థిని మౌమీత ను అత్యాచారం చేసే హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని నినదించారు. మరో ఘటన జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కఠిన చట్టాలు చేయాలని, పని ప్రదేశంలో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పలువురు ఆశాలు పాల్గొన్నారు.

చెరువులోకి నీరు వెళ్లే కాలువ కబ్జా

విశాలాంధ్ర - భోగాపురం : మండలంలో బంటుపల్లి నుండి భోగాపురం చెరువుకు నీరు వెళ్లే కాలువ కబ్జాకు గురైంది. దీంతో చెరువు పూర్తిగా నిండడంతో నీరు వెళ్లే మార్గం ఉన్న కాలువ లేకపోవడంతో చెరువు దిగువన ఉన్న వరి పొలాలు నీట మునుగుతున్నాయి. దీంతో సంబంధిత రైతులు వారి పంటలు నష్టపోవడంతో గగ్గోలు పెడుతున్నారు. వివరాల్లోకి వెళితే బంటుపల్లి నుండి భోగాపురం పేర్రాజు చెరువుకు వెళ్లే నీరు చెరువు నిండిన తర్వాత తిరిగి బయటకు వెళ్ళడానికి ఈ కాలువ ద్వారా దిగువ రైతులకు వెళుతుంది. అయితే ఈ వెళ్లే కాలవను స్థానికంగా ఉన్న ఒక రియల్ ఎస్టేట్ సంస్థ కబ్జా చేసి మూసి తమ స్థలంలోకి వచ్చేందుకు కాలువ పైగా దారి ఏర్పాటు చేసుకొని ఒక గేటు పెట్టి ఆ కాలువను ఇష్టానుసారంగా కప్పేసారు. దీంతో చెరువు నుండి నీరు వచ్చే మార్గం మూసుకుపోయింది. దీంతో పేర్రాజు చెరువులో నీరు పూర్తిగా నిండడంతో చెరువుకు ఉన్న గట్లు కోతకు గురవ్వడంతో స్థానికంగా చెరువుకి ఆనుకొని ఉన్న పంట పొలాలు ముంపునకు గురౌతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను గమనించి కప్పి వేసిన కాలువ ను తిరిగి తీయించి సమస్య పరిష్కరించవలసిందిగా స్థానిక రైతులు కోరుతున్నారు.

మహిళలకు, బాలలకు సత్వరమే న్యాయం జరుగుతుంది

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సులో ఎంపిడివో

విశాలాంధ్ర - జామి : మహిళలకు, చిన్నారులకు ఎక్కడ ఏవిధమైన అన్యాయం జరిగినా వారికి ప్రభుత్వపరంగా సత్వరమే న్యాయం చేసేందుకు అనేక చట్టాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎంపిడివో ఎం.సతీష్ అన్నారు. మండల కేంద్రమైన జామిలోని ఎంపిడివో కార్యాల యంలో మంగళవారం ఐసిడిఎస్, ఎస్‌కోట క్లస్టర్ ఆధ్వర్యంలో బాలలకు అందుబాటులో న్యాయం,బాల్యవివాహాలు నేరం, సాంఘిక దురాచారం వంటి అంశాలపైనే కాకుండా మహిళలు పని ప్రదేశాలలో ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారాలపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా ఎంపిడివోతో పాటు ఎస్‌కోట క్లస్టర్ సిడిపివో ఎం.ఉమా, ఎంఇవో కె.గంగరాజులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వీరు మహిళా రక్షణాకు సంబంధించిన చట్టాలపై వివరించారు. ప్రధానంగా బాల్యవివాహాలను అరికట్టేందుకు పూర్తి స్థాయిలో కృషి చేయాలని సూచించారు. అలాగే మహిళా చట్టాలుతోపాటు వారికి కలుగుతున్న సమస్యలు పరిష్కారాలపై వన్‌స్టాప్ సెంటర్ కౌన్సిలర్ కె.రమాదేవి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. వీటితో పాటు పలు రకాల హెల్ప్‌లైన్ నెంబర్లపై వివరించారు. పని ప్రదేశంలో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, దూషించినా ఫిర్యాదు నిమిత్తం గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు వివిధ రకాల కమిటీలు ఉంటాయని చెప్పారు. ఈసదస్సులో ఎన్‌జివో నుంచి సిహెచ్.పద్మ పాల్గొన్నారు. మండలంలోని ఐసిడిఎస్ సూపర్ వైజర్‌లు డి.సునీత, కె.విమల కుమారి, జి.కృష్ణవేణిల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.